క్లుప్తంగా

మాన్యం భూములకు కౌలు వేలం


కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం: యల్లావత్తుల నాగలింగేశ్వర స్వామి, నరసింహస్వామి ఆలయ మాన్యం భూములకు ఆలయ ఈఓ నర్సయ్య శుక్రవారం కౌలు వేలం నిర్వహించారు. ఈ ఆలయాలకు చెందిన దాదాపు 62 ఎకరాల మాన్యం భూములు వుండగా వేలంలో రూ.2 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. వేలంలో గ్రామ సర్పంచు చంద్రమోహన్, నాయకులు లక్ష్మీరెడ్డి, కృష్ణమూర్తి, పుల్లయ్య, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకారించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాహు: కాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీ నారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆల్ ఇండియా కేరళా ముస్లీం కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద ముస్లిం మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని చామకాల్వ దగ్గర ఓ ఫర్నిచర్ షాప్‌లో చేపట్టిన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మ ముఖ్య అతిథిగా హాజరై చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మద్, ఫిరోజ్, కరీముల్లా, మస్తాన్, హర్షద్, అక్బర్, షాహీద్, తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలంలోనీ అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుల్హన్ పథకం అమల్లో జాప్యం తగదు

ప్యాపిలి: ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆవాజ్ కమిటీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జలదుర్గం రసూల్, చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జలదుర్గం గ్రామంలో నిర్వహించిన ఆవాజ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే పేద ముస్లిం ఆడపిల్లల వివాహానికి దుల్హన్ పథకం కింద రూ.లక్ష అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా పథకం విధివిధానాలు ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్న ఆశతో పేద ముస్లింలు అప్పులు చేసి తమ కుమార్తెల వివాహాలు జరిపించి ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం షాదీ తోఫా కింద రూ.50 వేలు అందజేసిందని గుర్తు చేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీలను అమలు చేయాలన్నారు. కమిటీ సభ్యులు హుసేన్ వలి, దస్తగిరి, గుండాల్ బాషా, మహమ్మద్, మాబు, మాసుం వలి, అహ్మద్ బాషా, పెద్ద బషీర్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు సర్వం సిద్ధం

- ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు


ఆల్ పుర్ఖానా ఈద్గాకు రంగులు వేసిన దృశ్యం


సాయిబాబానగర్ ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ తర్వాత ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఈద్ ఉల్ అధా (బక్రీద్)కు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ నెల 10వ తేదీన జరుపుకునే ఈ పండుగ త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. శనివారం (నేడు) ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. బక్రీద్ పండుగ జరుపుకోవడం వెనుక అల్లాహ్ దాసులైన హజరత్ ఇబ్రాహీం అలైహివస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహివస్సలాంల త్యాగనిరతి దాగి ఉంది. బక్రీద్‌ను నిర్వహించేందుకు ఈద్గా, మసీదు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నంద్యాల పట్టణంలో ఐదు ఈద్గాల్లో భీమవరం రస్తాలోని ఆల్‌పుర్‌ఖానా ఈద్గా, ఎస్‌ఆర్‌బీసీ ఈద్గా, శాంతిరాం మెడికల్ కళాశాల వద్ద ఉన్న సున్ని మసీద్ ఈద్గా, బొమ్మలసత్రం ఈద్గా, సాయిబాబానగర్‌లోని ఈద్గా, నూనెపల్లె ఈద్గాల్లో ముస్లీంలు శనివారం పెద్ద ఎత్తున ప్రార్థనలు చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈద్గాలో మంచి నీటి సౌకర్యాలు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, ఫైర్ సిబ్బంది పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. నమాజ్‌కు పట్టణంలోని ముస్లీంలు దాదాపు 25వేల మంది హాజరవుతారని, వీరందరికి వసతులు కల్పించేందుకు రెండు రోజులుగా నిమగ్నమయ్యారు. పట్టణంలోని జుమ్మా మసీద్, గాంధీ చౌక్‌లోని ఖురేషీ మసీద్, మెయిన్ బజారులోని చౌక్ మసీద్, అంటికోట మసీద్, దభరాల మసీద్ తదితర మసీద్‌లలో గోడలకు సున్నం, వివిధ రకాల రంగులు వేశారు. పండుగ రోజు ప్రార్థనలు ఉదయం 9.30 నుంచి 10.30 వరకు మహమ్మద్ ప్రవక్త బోధనలు, సందేశాలు, ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలోమసీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీస్ బృందాలతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

బక్రీద్ విశిష్టత..

బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ అంటే సమర్పణ, త్యాగం, బలి అని అర్థం. సుమారు 4 వేల ఏళ్ల క్రితం.. ఇరాక్ దేశంలో ఉన్నతమైన కుటుంబంలో జన్మించిన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీంకు ఒక రోజు వచ్చిన స్వప్నంలో తన 86 ఏళ్ల వృద్ధాప్యంలో జన్మించిన ఏకైక కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ చేయాలని అల్లాహ్ కలలో ఆదేశించారనేది కల సారాంశం. అల్లాహ్ ఆదేశానుసారం తన కుమారుడిని బలి ఇవ్వడానికి ఇబ్రహీం సిద్ధం కాగా వెంటనే అల్లాహ్ దానిని స్వీకరించి ఇస్మాయిల్‌కు బదులుగా స్వర్గం నుంచి ఒక పొట్టేలును పంపి ఖుర్బానీ జరిగేలా చేశారు. ఆ త్యాగనిరతికి ప్రతీకయే బక్రీద్ అని ముస్లిం పెద్దలు చెబుతారు.

మార్కెట్‌లో సందడి..

వారం రోజుల నుంచే జిల్లాలో ముస్లింలు బక్రీద్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొత్త బట్టలు, పండగ సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలు కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పొట్టేళ్లను తెచ్చి విక్రయిస్తున్నారు.

ఉయ్యాలవాడ తహసీల్దార్‌గా సువర్ణాదేవి

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ తహసీల్దార్‌గా సువర్ణాదేవిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును కొలిమిగుండ్ల మండలానికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో అవుకు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సువర్ణాదేవి బదిలీపై వస్తున్నట్లు కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి.

నేటి నుంచి బాలాలయ వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని మూలమఠంలో వెలసిన శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాలయ (జీర్ణోద్ధరణ) వేడుకలను శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేణునాథరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా శనివారం ఉదయం మహాగణపతి పూజ, పంచగవ్య మేళనం, మండప దేవతా వాహన మూలమంత్ర జపాలు, పంచామృత రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 8వ తేదీన ఆదివారం ఉదయాన్నే ప్రతఃకాల పూజలు, అభిషేకాలు, దీక్షా హోమాలు, విగ్రహాల్లో ఉన్న కలశ శక్తిని కలశాల్లో ఆహ్వానం చేయడం, దేవతాప్రార్థన, కూష్మాండ బలిదానం, మూల విగ్రహ చలనం, తదితర కార్యక్రమాలు నిర్వహించి పూర్ణాహుతిని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి తరగతులు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని శ్రీ పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి పునఃశ్చరణ తరగతులు (సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం) ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఇంచార్జ్ గ్రంథాలయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. 40 రోజుల పాటు నిర్వహించిన తరగతులకు 35 మంది విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకున్నారన్నారు. వేసవి సెలవులను ఆహ్లాదంగా గడుపుతూ గ్రంథాలయంలోని కథల పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకున్నారన్నారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులకు వ్యక్తిగతంగా ఆలోచించే శక్తి పెరుగుతుందని దీంతో వ్యక్తిత్వ వికాసం, మనో విజ్ఞానంపెరుగుతాయన్నారు. ప్రతి ఒక్క చిన్న విషయానికి సెల్ ఫోన్లపై ఆధారపడటంతో ఆలోచనా శక్తి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం వేసవి పునఃశ్చరణ తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠకులు సుబ్బారావు, ప్రదీప్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నరేష్, నరేంద్ర, ఆదినారాయణ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు

పీఎం సూర్యఘర్ లక్ష్యాన్ని చేరుకోవాలి


మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ ఆదిశేషయ్య

నంద్యాల(న్యూటౌన్): పీఎం సూర్యఘర్ లక్ష్యాన్ని అధికారులు చేరుకోవాలని నంద్యాల జిల్లా నోడల్ ఆఫీసర్, చీఫ్ ఇంజనీర్ ఆదిశేషయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని పీజీ కళాశాలలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పతకంపై విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో పదివేల గృహాలకు సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్స్ ప్యానల్స్ బిగించాలన్నారు. ప్రతి మండలంలో 200 నుంచి 250 సర్వీసుల వరకు టార్గెట్లను పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో నంద్యాల విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుధాకర్‌కుమార్, ఏఈ నాగేశ్వరరావు, ఈఈ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, జయశంకర్, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు


విద్యుత్ దీపాలంకరణలో సయ్యద్ దర్వేష్ ఖాద్రీ స్వామి దర్గా


స్వామి వారి గంధం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన శ్రీసయ్యద్ దర్వేష్ ఖాద్రీ స్వామి ఉరుసు సందర్భంగా గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి వైస్ ఎంపీపీ ముల్లా రఫీ ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా చిన్నమకానం, మెయిన్ బజార్ మీదుగా పెద్దమకానం నుంచి దర్గా వరకు సాంప్రదాయ మేళతాళాలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు వందలాదిగా తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. శనివారం ఉరుసు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ముల్లా రఫి తెలిపారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి

పగిడ్యాల: వ్యవసాయ అనుబంధ రంగాలు పశుపోషణ, ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించి అధిక ఆదాయాన్ని పొందవచ్చని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం సంకిరేణిపల్లె, పగిడ్యాల గ్రామాల్లోని సచివాలయాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం, విత్తన శుద్ధి, పంట మార్పిడి పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. మొక్కజొన్నలో అంతర పంటగా కంది, వరిలో సస్యరక్షణ చర్యలైన విత్తనశుద్ధి, తెగుళ్ళ, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవిగౌడ్, వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి

విత్తనాలు ఎక్కడ?

- ఖరీఫ్ ప్రారంభమైన జాడలేని విత్తన పంపిణీ
- ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ముందస్తుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. వర్షాధారం కింద మెట్ట భూముల్లో మినుము, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,725 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఉయ్యాలవాడ, హరివరం, ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, కొండుపల్లె గ్రామాల్లో మినుము, మొక్కజొన్న, కంది విత్తనానికి సమాయత్తమవుతున్నారు. అయితే మండల పరిధిలోని 11 రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు కూటమి ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై స్థానిక మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డిని శుక్రవారం వివరణ కోరగా ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు తప్పా ఇతర రకాల విత్తనాలు, ఎరువులు సరఫరా కాలేదన్నారు.


హరివరం గ్రామ సమీపంలో ట్రాక్టర్ సహాయంతో మినుము విత్తనం వేస్తున్న రైతు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రమోషన్ కమిటీ (డీఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 65 దరఖాస్తులు అందగా సింగిల్ డిస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 53 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న 12 దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలోగా తగిన పరిష్కారం అందించాలన్నారు. పరిశ్రమలకు అందజేయాల్సిన ప్రోత్సాహకాలకు సంబంధించి పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ విద్యుత్తు, సేల్ టాక్స్ తదితర రైతుల క్రింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగంలోని 16 యూనిట్లకు 31.85 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, ఎల్‌డీఎం రవీందర్ కుమార్, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి ఐశ్వర్య రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

షైనింగ్ స్టార్స్ అవార్డుల పంపిణీకి చర్యలు

జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులతో అభినందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి షైనింగ్ స్టార్స్ అవార్డుల పంపిణీపై పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, ఏపీసీ ప్రేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు జూన్ 9వ తేదీన షైనింగ్ స్టార్స్ అవార్డులతో అభినందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పదిలో 180 మంది, ఇంటర్‌లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారికి సమాచారం అందించాలన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, టాలెంట్ వర్క్ టెక్నాజీ కంపెనీ, సుజల పైప్స్, ఓడాఫోన్, ఐడీయా, యాక్సిస్‌బ్యాంక్ చెందిన 10 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ జాబ్ మేళాలో పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీడీఎం ఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివారాలకు 7673902328, 9154830286, naipunyam.ap.gov.in సంప్రదించాలన్నారు.

9న ఆలయ భూముల బహిరంగ వేలం పాటలు

నంద్యాల(వ్యవసాయం): కోటావీధిలోని శ్రీబ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం ఆలయ భూములు, రూముల బాడుగల బహిరంగ వేలం ప్రకటనల ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మీ నారాయణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల కౌలుకు గాను భూములు, రూముల అద్దెకు బహిరంగ వేలాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే ప్రతి పాటదారుడు రూ.2వేలు డిపాజిట్ చేయాలన్నారు.

14న కదమల కాలువలో..

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కదమల కాలువ గ్రామంలోని పలు ఆలయ భూములకు ఈనెల 14న వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రూపు దేవస్థానముల ఈఓ నాగప్రసాద్ శుక్రవారం తెలిపారు. శివనంది దేవస్థానముకు సంబంధించిన 27.97 ఎకరాల భూమికి, చెన్నకేశవస్వామి దేవస్థానమునకు చెందిన 35.12, వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 4, భైరవ స్వామి దేవస్థానానికి చెందిన 10 ఎకరాల భూములకు ఈనెల 14న వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

అవుకు: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. అవుకు మండలం మెట్టుపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(20) ఈ నెల 4వ తేదీ బట్టలు ఉతకడానికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో యువతి తండ్రి రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవయవదానంతో జీవితాల్లో వెలుగులు

బొమ్మలసత్రం: గుంతనాల గ్రామానికి చెందిన సుజాత అవయవదానంతో మరి కొంత మంది జీవితాల్లో వెలుగులు నిలిపిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్ అన్నారు. గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సుజాత గత కొన్ని రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడింది. ఆమెకు బ్రెన్‌డెడ్ కావడంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆమె తండ్రి నాగేంద్ర గౌడ్, తల్లి శేషమ్మ కర్నూలులో అవయవదానానికి అంగీకరించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్తుండగా స్థానిక బొమ్మలసత్రం వద్ద వైఎస్సార్‌సీపీ అధికారప్రతినిధి అనిల్ అమృతరాజ్, మున్సిపల్ విభాగం అధ్యక్షులు టీవై శివయ్య, నాయకులు కిరణ్, బసవేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు సన్నల సాయిరామ్ రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాల్‌మిల్ అమీర్ మాట్లాడుతూ అవయవదానం చేసి 8 మంది ప్రాణాలు నిలబెట్టిన సుజాత అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు.


సుజాత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నివాళులర్పించిన డీఎస్పీ..

స్థానిక బొమ్మలసత్రం వద్ద డీఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ నివాళులు అర్పించారు. ప్రమాదంలో సుజాతకు బ్రెయిన్‌డెడ్ కావడం తర్వాత ఆమె కుటుంబ సభ్యులు మంచి మనస్సుతో అవయవదానానికి అంగీరించటం గొప్ప విషయమన్నారు. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతి కలిగించాలని ప్రార్థించారు.

చిన్న యంత్రం.. పెద్ద మేలు

వ్యవసాయంలో రోజురోజుకు యాంత్రీకరణ పెరుగుతోంది. ప్రస్తుతం విత్తు మొదలు కలుపు, కోతలు, నూర్పిడి తదితర పనులన్నీ యంత్రాలతోనే చేస్తున్నారు. కూలీల సమస్య పరిష్కారంతో పాటు ఖర్చులు తగ్గించుకునే మార్గంలో రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ముత్తలూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి అనే రైతు నర్సాపురం సమీపంలో సాగు చేసిన మిర్చి పంటలో వీడర్ అనే చిన్న యంత్రంతో తానే కలుపు మొక్కలను తొలగిస్తూ కనిపించాడు. లీటరున్నర పెట్రోల్‌తో గంటలోనే ఎకరా పొలంలో కలుపు మొక్కలను తొలగించుకోవచ్చని, దీని ఖరీదు రూ.30 వేలు అని, ఆన్‌లైన్‌లో తెప్పించుకున్నానని చెప్పాడు. చిన్న యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా సమయం ఎంతో కలిసి వస్తుందన్నారు. – రుద్రవరం


మిర్చి పైరులో చిన్న యంత్రంతో కలుపు తొలగిస్తున్న రైతు

యోగా నిత్యం సాధన చేయాలి


యోగా చేస్తున్న విద్యార్థులు

గోస్పాడు: ప్రతి ఒక్కరూ యోగా నిత్యం సాధన చేయడంతో ఆరోగ్యం చేకూరుతుందని మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌ఎంబీఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు యోగా క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాపై శిక్షణ ఇచ్చారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాకు సమయం కేటాయించుకోవాలన్నారు. దీంతో ఒత్తిడి తగ్గి మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉంటారన్నారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే నష్టాలను వివరిస్తూ, డ్రగ్స్ బారిన పడకుండా ఆరోగ్యకరమైన యోగ, స్పోర్ట్స్ వైపు విద్యార్థులు నడవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.